క్లుప్తంగా

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి


గణపవరంలో ఎన్ఆర్ఈజీఎస్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

గణపవరం: ఉపాధిహామీ పథకం పనులు పారదర్శకంగా జరగాలని, పనుల్లో నాణ్యత ఉండాలని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం గణపవరం మండల కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా ఈసమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో జరుగుతున్న ఉపాధిపనులపై సమీక్షించారు. ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, మండల ఇంజనీరింగ్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్, సీనియర్ మేట్స్ పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు: మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ద్రోణాదుల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ తారకేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

లైన్‌మేన్ బాలకృష్ణ సేవలు అభినందనీయం


ఏలూరులో భీమడోలు లైన్‌మేన్ బాలకృష్ణను సత్కరిస్తున్న జిల్లా ఎస్ఈ పి.సాల్మన్‌రాజు

భీమడోలు: భీమడోలు విద్యుత్ శాఖ లైన్‌మేన్ పంచకర్ల బాలకృష్ణ సేవలు అభినందనీయమని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు అన్నారు. జాతీయ లైన్‌మెన్ దివాస్‌లో భాగంగా మంగళవారం భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా భీమడోలు లైన్‌మేన్ బాలకృష్ణకు ఉత్తమ లైన్‌మెన్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఏలూరులో జరిగిన అభినందన కార్యక్రమంలో భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో అంకితభావంతో విధులను నిర్వహిస్తూ విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలకు గుర్తింపుగా బాలకృష్ణకు పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేసి మరిన్ని అవార్డులను అందుకోవాలని అభినందించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు కేఎం అంబేడ్కర్, పీఏ ఖాన్, పి.రాధాకృష్ణ, టి.శశిధర్, కె.శ్రీనివాస్, ఏడీఈలు కె.గోపాలకృష్ణ, ఏఈ వి.శివాజీ, బాలకృష్ణలు పాల్గొన్నారు.

6న కోకో రైతుల చలో ఏలూరు


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6న ఉదయం 10 గంటలకు కోకో రైతుల సమస్యలపై చలో ఏలూరు పేరుతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.900 ధర ఉన్నా.. రూ.500 నుంచి రూ.650 మాత్రమే ధర ఇవ్వడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అన్ని గ్రామాల నుంచి కోకో రైతులు ఏలూరు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

వెంకటేశ్వరరావును పరామర్శించిన జేపీ


వెంకటేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న జేపీ తదితరులు

ఏలూరు (టూటౌన్): అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆచంట వెంకటేశ్వరరావు చిన్న కుమార్తె ఆచంట ప్రియాంక (26) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) మంగళవారం వెంకటేశ్వరరావును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి ధైర్యం చెప్పారు. వెంకటేశ్వరరావును బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నేరుసు చిరంజీవి, తదితరులు పరామర్శించారు.

హోలీల్యాండ్‌లో అద్భుత ఘట్టాలు



పవిత్ర భూమి నమూనా


పశువుల పాకలో ఏసు జననం


సముద్ర అలలను గద్దించిన ఏసు

పెదవేగి: ఏసు క్రీస్తు నడయాడిన పవిత్ర స్థలాలన్నింటినీ కళ్లకు కట్టినట్టు చూపుతోంది హోలీ ల్యాండ్. దీనిని పునీత అన్నమ్మ సత్యోపదేశ సంస్థ ఆధ్వర్యంలో పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో ఏర్పాటుచేశారు. జెరుసలేం వెళ్లి పవిత్ర స్థలాన్ని దర్శించలేని వారు ఈ హోలీల్యాండ్‌ను సందర్శించి తమ భక్తిప్రపత్తులను చాటుకుంటారు. బుధవారం నుంచి 40 రోజుల పాటు క్రీస్తవ దీక్ష పూనీన వ్యక్తులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోపాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక, ముంబాయి ప్రాంతాల నుంచి విశ్వాసులు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు, సిలువ మార్గం చేస్తుంటారు. ఆవరణలో ఉన్న ధ్యాన కేంద్రంలో ఏకాంత ప్రార్థనతో మంచి ఫలితాలు పొందుతారు. ఈ పవిత్ర స్థలాన్ని ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సందర్శించవచ్చు. ప్రతి మంగళవారం సెలవు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 99496 78272లో సంప్రదించవచ్చని హోలీల్యాండ్ డైరెక్టర్ సిస్టర్ ఇన్యాసమ్మ తెలిపారు. ఫాదర్ సిల్వియో పొన్సులి పీఐఎం ఈ సంస్థ గురువుచే పునీత అన్నమ్మ సత్యోపదేశ సభ స్థాపించి 2014కి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ హోలీ ల్యాండ్ నమూనాను నిర్మించామన్నారు.


యాకోబు బావి వద్ద సమరియ స్త్రీతో మాట్లాడుతున్న ఏసుక్రీస్తు


కానా పెళ్లి విందులో నీటిని ద్రాక్ష రసంగా మార్చిన ఏసు


క్రీస్తుకు ముళ్ల కిరీటం పెట్టే దృశ్యం


ఏసు శిలువ మోయుట


ఏసు తన తల్లిని యోహానుకు అప్పగించే దృశ్యం

గోదావరి కాల్వలో కర్రనాచు తొలగింపు


కాల్వలో కర్రనాచును తొలగిస్తున్న కూలీలు


పడవలపై వెళ్లి గుర్రపు డెక్క, నాచు, తూడులను తొలగించే పనులు పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: గోదావరి కాల్వలో పేరుకుపోయిన కర్రనాచు, గుర్రపు డెక్కలను తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగు నీటి సమస్యకు కారణంగా ఉన్న వాటిని తొలగించే పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. కొన్ని రోజులుగా నీటి ప్రవాహం కిందకు పారక సాగునీరు, తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. దీనితో కాల్వలో కై కరం, పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు వరకు దట్టంగా ఉండడంతో ఆ ప్రాంతాలతో పాటు శివారు ఆయుకట్టు రైతాంగం సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాల్వలో నీరు ప్రవాహానికి అడ్డుగా ఉన్న కర్రనాచును ప్రత్యేక పడవలతో వాటిని తొలగిస్తున్నారు. దీనితో నీరు కిందకు పారేలా తగు చర్యలు చేపట్టారు. గుండుగొలను జలవనరుల శాఖ సెక్షన్ పరిధిలోని ఏఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఐజీ ఆర్‌వీ సత్యనారాయణ, లస్కర్లు, సిబ్బంది ఆ పనులను చేపట్టారు. దీనితో శివారు ప్రాంతం అయిన గుండుగొలను వద్ద నీటి మట్టం పెంచేందుకు సంబంధిత అధికారులు నానాతంటాలు పడుతున్నారు. ఇక్కడ నీటి మట్టం సుమారు 3.5 అడుగులకు పెరిగితే గుండుగొలను, దెందులూరు మండలాలకు సాగునీరు చేరుతుంది. ఈనెలాఖరు నాటికి పంట చేతికందే దశలో ఉన్నందున చివరి తడులు పడకపోతే వేలాది ఏకరాల్లోని పంట దెబ్బతింటుందని రైతులు అంటున్నారు. అయితే అధికారులు నీటి మట్టం పెంచేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్

దెందులూరు: అంటువ్యాధులు అరికట్టడంలో ఆరోగ్య ఆశా కార్యకర్తల భాగస్వామ్యం చాలా కీలకమని ఏలూరు జిల్లా మలేరియా అధికారి పీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా ఆధ్వర్యంలో దెందులూరు మండలం గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి బయట, ఇంటి లోపల ఉన్న నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే పాటించాలన్నారు. దోమల నిర్మూలించాలంటే దోమ లార్వాలను ఎలిమినేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జే గోవిందరావు మాట్లాడుతూ ప్రజలు వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలని అశ్రద్ధ వహిస్తే వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రోజా, శశాంక్, బాలకృష్ణ, కేత సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు మార్తమ్మ, హైమావతి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం మీవెంటే ఉంటుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. శనివారం నారాయణపురం సచివాలయం 2 పరిధిలో డ్రైడేలో అమలు అయిన కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు.

సేంద్రియ ఎరువులు వాడాలి

లింగపాలెం: రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని వాడి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారులు ఏడీఏ బి.నాగకుమార్, ఏవో ఎ.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని యడవెల్లి గ్రామంలో అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవో మురళీకృష్ణ మాట్లాడుతూ దేశానికి వెన్నుముక రైతేనన్నారు.

చిరుధాన్యాలతోనే మహిళల్లో రోగ నిరోధకశక్తి


కురెళ్లగూడెంలో చిరుధాన్యాల వాడకంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఎస్‌కే నూర్జహాన్


మహిళా దినోత్సవం సందర్భంగా పిప్పరలో మహిళల ప్రదర్శన


వైద్యసిబ్బంది సమావేశంలో మాట్లాడున్న వైద్యాధికారిణి కిరణ్మయి


పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్ శ్రీదేవి

భీమడోలు: చిరుధాన్యాలు గల పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా మహిళల్లో రోగ నిరోధకశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతుల వుతారని పూళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే నూర్జహాన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా మంగళవారం కురెళ్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆడపిల్లను రక్షిద్దాం ..ఆడపిల్లను చదివిద్దాం.. బాల్య వివాహాలు నిర్మూలన, మహిళా సాధికారత, మహిళల హక్కులపై కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎస్‌కే నూర్జహాన్ మాట్లాడుతూ మహిళ సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వాలు మహిళలు కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు హక్కులతో పాటు బాధ్యత కలిగి ఉండాలన్నారు. నేటి సమాజంలో బాల్య వివాహాలు పెరిగిపోతున్నాయని, ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని బాల్య వివాహాలకు దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

గణపవరం: వైద్యసిబ్బంది ఇంటింటా సర్వేకు వెళ్లిన సమయంలో వారికి ఆరోగ్య నియమాలు గురించి వివరించి, అవగాహన కల్పించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో, ఎఎన్ఎంలు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశావర్కర్లు, ఇతర వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ప్రతీ 15 రోజులకోసారి నీళ్ల ట్యాంకులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆడపిల్లలకు యుక్తవయస్సు వచ్చేవరకూ పెళ్లి చేయకుండా చూడాలని, రక్తహీనత రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వివరించారు. ప్రతీనెలా హాస్టల్స్‌ను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితులు పరీక్షించాలన్నారు. ఆస్పత్రులలోనే ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ గర్భిణి నెలవారీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా హైరిస్క్‌ను ముందే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తులసి పాల్గొన్నారు.

మహిళలంతా ఆరోగ్యవంతులు కావాలి

గణపవరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలంతా ఆరోగ్యకరమైన, సంతోషకరమైన జీవనం గడిపేలా ప్రతిజ్ఞ చేయాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. మంగళవారం గణపవరం ఐసిడీఎస్ ఆధ్వర్యంలో పిప్పర సెక్టార్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు ప్రదర్శన నిర్వహించారు. మహిళల ఆరోగ్యంపై గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. హెల్త్‌డైట్ పాటించాలని, ప్రతీ రోజూ యోగా, వ్యాయామం చేయాలని, మిల్లెట్, డ్రైఫ్రూట్స్ వాడాలని, రక్తహీనత లేకుండా తగిన వైద్యం పొందాలని మహిళలకు వివరించారు. ఈకార్యక్రమంలో ఐసిడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని ఆరోగ్యసిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలి

దెందులూరు: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి తెలిపారు. మంగళవారం పోతునూరు సెక్టార్ పరిధిలో కొమరేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు యుక్త వయస్సు రాకుండా వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేస్తే శారీరక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాలను గుర్తించాలన్నారు. అలాగే పోక్సో చట్టం, శిక్షలు గురించి వివరించారు. అనంతరం హెల్త్ హెచ్‌వీ యోగా ప్రాధాన్యత, ప్రయోజనాలను ఆసనాల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఝాన్సీ, సహాయకురాలు లక్ష్మి, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

పెదవేగి : ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలు నిరోధించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మేరీబాయమ్మ తెలిపారు. మంగళవారం పెదవేగి మండలం నడిపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీబాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ గుర్తింపు సంఖ్యను పొందాలి


రైతులతో మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

పెదపాడు :రైతులు తప్పని సరిగా గుర్తింపు సంఖ్యను పొందాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు, వీరమ్మకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఫార్మర్ యునిక్ ఐటీ ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల కలిగే లాభాలను వివరించారు. రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు, ఈకేవైసీకి మార్చి 6 తేదీతో ముగిస్తుందన్నారు. రైతులు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.